
ఓటు హక్కు వినియోగించుకున్న 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్


కుటుంబ సభ్యులతో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు తైనాల విజయ్‌కుమార్


కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



ఓటు హక్కు వినియోగించుకున్న నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు

- ఓటు వేసేందుకు ఆసక్తి చూపిన యువత
- కొన్ని చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- తమ బూత్ ఎక్కడుందో తెలియక అవస్థలు పడ్డ వృద్ధులు
- రాత్రి వరకు కొనసాగిన ఓటింగ్

ఓటెత్తిన చైతన్యం

61.15%
2019లో పోలింగ్

62.64%
2024లో పోలింగ్
రాత్రి 10 వరకు

నియోజకవర్గంలో ఓటింగ్ శాతం

సమయం	శాతం
ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య	5.12
ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య	17.22
ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు	31.11
మధ్యాహ్నం 1 గంట నుంచి 3 వరకు	41.91
మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు	53.31
సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు	62.64

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు క్యూలో బారులు తీరారు. మండుటెండను లెక్క చేయక వృద్ధులు, వికలాంగులు సైతం పోలింగ్ బూత్‌లను సందరించి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఆ సమయానికి దక్షిణలో 62.64 శాతంగా ఓటు నమోదు అయింది.

డాబాగార్డెన్స్ : ఎన్నికలు రసవత్తరంగా ముగిసాయి. ఈ దఫా యువత ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో గత ఎన్నికల కన్నా ఈసారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగింది. అన్ని వర్గాల ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు..
చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభించాల్సి ఉండగా ఏజెంట్లకు మాక్‌పోలింగ్ కారణంగా 7.30 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. చాలా చోట్ల 9 గంటల వరకు ఈవీఎంలు పని చేయలేదు. దీంతో చాలా మంది ఓటర్లు క్యూలో నిల్చోలేక వెనుదిరిగారు. భానుడి ప్రతాపానికి ఓటర్లు విలవిల్లాడారు. అయినప్పటికీ మండుటెండను లెక్క చేయకుండా క్యూలైన్లలో ఉండి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వీల్‌చైర్‌పై ఓటింగ్‌కు..
సార్వత్రిక ఎన్నికల్లో యువత, వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులను ఆ సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు వీల్‌చైర్‌పై పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించారు. అలాగే ఓటు వినియోగించుకునేందుకు ఆటోలు.. కార్లపై వచ్చిన పలువురు వృద్ధులు, దివ్యాంగులను ఎన్నికల సిబ్బంది వీల్‌చైర్లపై తీసుకెళ్లి ఓటు వేయించారు.


కుటుంబ సభ్యులతో క్యూలైన్‌లో నిల్చున్న దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

ఇబ్బంది పెట్టిన ఈవీఎం :
మహారాణిపేట : లక్ష్మీ టాకీసు ఏరియా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల పోలింగ్ స్టేషన్ 99లో ఈవీఎం మొరాయించింది. దీని వల్ల కొద్ది సేపు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. మరొక ఈవీఎం ఏర్పాటు చేసే వరకు ఓటర్లు సహనంతో వేచి ఉండి తర్వాత ఓటు వేశారు.

పోలింగ్ కేంద్రంలో ఫిట్స్‌కు గురైన మహిళ..
విశాఖ దక్షిణ అసెంబ్లీ పరిధిలో లక్ష్మిటాకీసు ఏరియాలో ఉన్న ఎంవీడీఎం హైస్కూలులో ఓటు వేయడానికి వచ్చిన ఒక మహిళ ఫిట్స్‌కు గురైంది. 101 నెంబర్ పోలింగ్ స్టేషన్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో అక్కడ ఉన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. కొద్ది సేపటి తర్వాత ఆమె ఓటు వేసి ఇంటికి చేరుకుంది. ఆ తర్వాత 108 వాహనాన్ని కూడా పోలింగ్ స్టేషన్‌కు అధికారులు రప్పించారు. అయితే అప్పటికే ఆమె కోలుకొని ఇంటికి చేరుకోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

35వ వార్డులో..
జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ మొదలైంది. తుపాను భవనం, సయ్యాద పైడితల్లి కల్యాణ మండపం, గణేశ్వర పాఠశాల, జీవీఎంసీ ప్రైమరీ పాఠశాల వద్ద పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎండల నేపథ్యంలో వృద్ధులు ఉదయాన్నే ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నడవలేని వృద్ధుల కోసం ఎన్నికల కమిషన్ ఏ వీల్‌చైర్లు ఏర్పాటు చేసింది.

పోలీస్ నిఘా..
పాతనగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీసీపీ-2 సత్తిబాబు నేతృత్వంలో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి డీసీపీ పాతనగరాన్ని జల్లెడ పట్టారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గస్తీ కాశారు. దీంతో పాతనగరంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.


ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపిస్తున్న నిరాశ్రయులు

ఓటు హక్కు వినియోగించుకున్న నిరాశ్రయులు..
అల్లిపురం : టీఎస్ఆర్ కాంప్లెక్స్ నైట్ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న 102 మంది నిరాశ్రయులు సోమవారం తమ ఓట హక్కు వినియోగించుకున్నారు. వసతి గృహం కార్యదర్శి ప్రగడ వాసు వారిని పోలింగ్ బూత్‌కు తీసుకెళ్లటంతో వారు ఓటు వేశారు. ఓటు వేసిన వీరిలో వికలాంగులు, ఒంటరి మహిళలు ఉన్నారు.

కొబ్బరితోట, అల్లిపురం ప్రాంతాల్లో..
ఉదయం నుంచి ఓటింగ్ సరళి ఒకేలా సాగింది. ఎక్కడా ఎటువంటి గొడవలు జరగకపోవటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కొబ్బరితోట, అల్లిపురం ప్రాంతాల్లో ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. అయితే ఎండ వేడిమికి ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు.

జ్ఞానాపురంలో ప్రశాంతం..
కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో సెయింట్ పాఠశాల, ఆర్‌సీఎం, జ్యోతి నిలయం, జోన్-5 కార్యాలయం పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. యువత, వృద్ధులు, ఎక్కువగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదే..


ఏజెంట్లను అడిగి ఓటింగ్ సరళి తెలుసుకుంటున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. 27వ వార్డు రాజేంద్రనగర్‌లో గల టీవీఎస్ రావు శ్రీకృష్ణా విద్యామందిర్ 216వ బూత్‌లో తల్లి అమ్మాజీతో సహా కుటుంబ సమేతంగా క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన హక్కు అన్నారు. సేవ చేసే వారిని, మంచి వ్యక్తులను ఎన్నుకునేందుకు ఓటు అనే ఆయుధాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చెప్పారు. సింహాద్రి అప్పన్న, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు, ప్రజల దీవెనలతో కచ్చితంగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. స్థానికుల అండతో అంతిమ విజయం సాధించబోతున్నామని వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించారని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వార్డుల్లోని బూత్‌లలో పర్యటించానని, అన్ని వర్గాల ప్రజలు తమకు అనుకూలంగా చెప్పడంపై స్థానిక నాయకులు ఎంతో ఉత్సాహకంగా కనిపించారన్నారు. వాసుపల్లి సతీమణి ఉషారాణి, కుమారులు సూర్య, గోవిందు సాకేత్, కోడలు సౌందర్య రాశి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వాసుపల్లితో పాటు పార్టీ నాయకులు మూగి శ్రీనివాసరావు, నీలాపు సర్వేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేటర్ అమ్మాజీ తదితరులు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.


జోన్-5 పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన కోడిగుడ్ల పూర్ణిమ


బంగారుమెట్ట పోలింగ్ కేంద్రానికి వృద్ధుడిని తీసుకొస్తున్న వ్యక్తి


స్వామి వివేకానంద సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధురాలిని వీల్‌చైర్‌పై ఎన్నికల కేంద్రానికి తీసుకెళ్తున్న సూరాడ అప్పారావు


వృద్ధురాలిని వీల్‌చైర్‌పై పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సనపల రవీంద్రభరత్

అభ్యర్థి గుర్తు కనిపించలేదు.. అధికారులు పట్టించుకోలేదు..

నేను ఓటు వేయడానికి వెళ్లాను. కానీ నేను ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాట్‌లో నేను ఏ పార్టీకి ఓటు వేశానో.. ఆ పార్టీ అభ్యర్థి గుర్తు కనిపించలేదు. ఈ విషయం అధికారులు, బూత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాను. కానీ ఎవరూ స్పందించలేదు. బూత్‌లో ఉన్న వారందర్నీ గట్టిగా నిలదీశాను. కానీ పరిష్కారం కాలేదు. అందరూ సిండికేట్‌గా మారారు.

– త్యాగరాజన్ గుటకల, మంథావారి వీధి పోలింగ్ బూత్ 163వ నంబర్‌లో బూత్‌లో ఓటు వేసిన వ్యక్తి


పెద జాలరిపేటలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరిన ఓటర్లు


కొబ్బరితోట వద్ద మండుటెండలో కూడా క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు


ఈవీఎం మొరాయించి పాతనగరంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల


గణేశ్వర పాఠశాల వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీసీపీ సత్తిబాబు


ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వృద్ధురాలిని తీసుకెళ్తున్న దృశ్యం


జీవీఎంసీ 35వ వార్డు తుపాను బిల్డింగ్ వద్ద బారులు తీసిన ఓటర్లు

తొలిసారి ఓటు వేసి.. మనసారా మురిసి

- ఆనందం వ్యక్తం చేసిన యువ ఓటర్లు
- అభివృద్ధి, సంక్షేమం అందించే నాయకుడే రావాలని ఆకాంక్ష

డాబాగార్డెన్స్ : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఈసారి యువత పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకుంది. ప్రభుత్వం రెండు, మూడు దఫాలుగా అవగాహన కల్పించడంతో పాటు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. గత నెల వరకు ఓటు నమోదుకు అవకాశం కల్పించడంతో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో యువతీ యువకులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనిపై యువతరం స్పందన వారి మాటల్లో..

చాలా సంతోషంగా ఉంది..



తొలిసారి నేను వేశాను. చాలా సంతోషంగా ఉంది. సంక్షేమం, అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పించగలిగే సత్తా ఉన్న నాయకులను ఎన్నుకోవాలన్న ఉద్దేశంతో నా ఓటు హక్కు వినియోగించుకున్నాను. నేను ప్రస్తుతం బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ఓటు వేయడానికి విశాఖ వచ్చాను. వన్‌టౌన్ ఏరియాలో గల ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో ఓటు వేశాను.

–వెదుళ్లపల్లి సింధు, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, విశాఖ వాసి

గర్వంగా ఫీలవుతున్నా..



ప్రజాస్వామ్య వ్యవస్థలో తొలిసారి నేను కూడా భాగస్వామినైనందుకు గర్వంగా ఫీలవుతున్నా. యువతకు ఉపాధి కల్పించే మార్గాలు చూపించడమే కాక సంక్షేమ ఫలాలు అర్హులైన వారందరికీ అందేలా, అభివృద్ధి కూడా జరిగేలా చూసే నాయకులను ఎన్నుకునే అవకాశం కలిగింది. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడం వల్ల రాష్ట్రానికి, దేశానికి మంచి జరుగుతుందనే ఉద్దేశంతో నా ఓటు హక్కు వినియోగించుకున్నాను.

ఎం. సూర్యసాకేత్, దక్షిణ నియోజకవర్గం

రాష్ట్రం అభివృద్ధి చెందాలి..



రాజ్యాంగం నాకు కల్పించిన హక్కుల్లో ఒక్కటైన ఓటు హక్కును ఈ ఎన్నికల్లో వినియోగించుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నేను వేసిన ఓటు రాష్ట్రాభివృద్ధి దోహదపడుతుందని భావిస్తున్నాను. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేగలిగే నాయకులొస్తేనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది.

వి. బిందు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, విశాఖపట్నం

కర్ఫ్యూను తలపించిన రహదారులు


నిర్మానుష్యంగా మారిన కెప్టెన్ రామారావు జంక్షన్


జనసంచారం లేక బోసిపోయిన అల్లిపురం

అల్లిపురం : ఒకపక్క ఎండ వేడి, మరో పక్క ఓట్ల పండగ కావడంతో సోమవారం అన్ని చోట్ల నిర్మానుష్య వాతావరణమే కనిపించింది. దాంతో పాటు ఎన్నికల నేపథ్యంలో లేబర్ హాలిడే ప్రకటించడంతో దుకాణాలన్నీ దాదాపు మూసివేయడంతో రోడ్లన్నీ జనసంచారం లేక బోసిపోయాయి. ఏ జంక్షన్ వద్ద పెద్దగా వాహనాలు, పాదచారులు కూడా కిపించలేదు. ఎన్నికల కేంద్రాల వద్ద మాత్రమే జనం బారులు తీరి కనిపించారు.

ఔరవురా..!


ద్వారకానగర్‌లో ఓ టిఫిన్ బండి వద్ద ఇలా..

డాబాగార్డెన్స్ : ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం లేబర్ హాలిడే ప్రకటించడంతో దుకాణాలు మూతపడ్డాయి. షాపింగ్ మాల్స్ తెరవలేదు. సినిమా థియేటర్లు ఓపెన్ కాలేదు. మరీ ముఖ్యంగా హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో పాటు తోపుడు బళ్ల టిఫిన్ దుకాణాలు కూడా లేకపోవడంతో నగరజీవులు అల్లాడారు. నిత్యం టిఫిన్ దుకాణాలపై ఆధార పడేవారు అవస్థలు పడ్డారు. ఉదయం టిఫిన్ దొరక్క, మధ్యాహ్నం హోటళ్లు లేక భోజనప్రియులు తెగ ఇబ్బందులు పడ్డారు. ఎక్కడైనా చిన్నపాటి తోపుడు బండి వద్ద టిఫిన్ ఉందంటే తినేందుకు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి మరీ ఆరగించారు. ఇదే తరహాలో ద్వారకానగర్‌లో ఓ టిఫిన్ బండి వద్ద వందలాది మంది టిఫిన్ కోసం క్యూ కట్టారు. దీంతో వ్యాపారులు అమాంతం ధరలు పెంచేసారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారని ఆలయ వర్గాలు తెలియజేశాయి.